సాక్షి ఒడిశా
బుధవారం । 16 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.6.47.330
బంగారం	200 మిల్లీ గ్రాములు
వెండి	116 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



రైలు ఢీకొని ఏనుగు మృతి

రైలు ఢీకొని గున్న ఏనుగు ప్రాణాలు కోల్పోయింది. పట్టాలు దాటుతుండగా సరుకు రవాణా ఢీకొట్టడంతో ఈ ఘటన జరిగింది. - 10లో

రుతు పవనాల వీడ్కోలు

భువనేశ్వర్: రాష్ట్రం నుంచి నైరుతి పవనాలు వెడలిపోతున్నాయి. ఈ ప్రక్రియ మంగళవారంతో ముగియనుందని స్థానిక ప్రాంతీయ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ నెల 13వ తేదీ నుంచే రుతు పవనాలు వెనుదిరిగే ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొంది. ఈ ఏడాది చివరి 15 రోజులు మినహా రాష్ట్రంలో సగటున సాధారణ వర్షపాతం నమోదైందని వెల్లడించింది. రాష్ట్ర స్థాయిలో మల్కన్‌గిరి జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైందని పేర్కొంది.

వరి వడిగా అడుగులు

- ఖరీఫ్ వరి సేకరణ పటిష్టం: సీఎం మోహన్ చరణ్ మాఝి
- వ్యవస్థ ఆధునికీకరిస్తామని హామీ
- సన్నకారు రైతుకు న్యాయం చేస్తామని భరోసా



లోక్ సేవా భవన్‌లో ముఖ్యమంత్రి అధ్యక్షతన వరి సేకరణ ఆధునికీకరణ సమీక్ష సమావేశం

భువనేశ్వర్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లోని వరి సేకరణపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సేకరణ వ్యవస్థను ఆధునికీకరిస్తామని చెబుతోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన స్థానిక లోక్ సేవా భవన్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడా, రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి, ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి డాక్టరు కృష్ణచంద్ర పాత్రో, న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి నికుంజ బిహారి ధొలా, రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ వై.బి. ఖురానియా, వ్యవసాయం, సహకారం, ఆహార సరఫరా, రవాణా తదితర ప్రభుత్వ శాఖల ప్రముఖ కార్యదర్శులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 30 జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. ఎన్నికల హామీ మేరకు రైతులకు కనీస మద్దతు ధరతో బోనస్ చెల్లించేందుకు వీరు సంసిద్ధత వ్యక్తం చేశారు. అన్ని వర్గాల రైతులకు లబ్ధి చేకూరాలని, ప్రధానంగా సన్నకారు రైతు పండించే పంట కొనుగోలుకు అత్యధిక ప్రాధాన్యత కల్పించాలని నిర్ణయించారు. రాష్ట్ర రైతులకు అన్యాయం జరగకుండా ఇరుగు పొరుగు సరిహద్దు రాష్ట్రాల నుంచి రైతులు పండించే వరి చొరబాటు నివారించాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధికారులకు ఆదేశించారు.

మండీల ఆధునికీకరణ

వరి సేకరణ, కొనుగోలు పురస్కరించుకుని ఏర్పాటు చేసే మండీ వ్యవస్థని ఆధునికీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పలు ప్రాంతాల నుంచి రైతులు పోగు చేసే ధాన్యం అకాల వర్షాలతో తడిసి ముద్ద కాకుండా సంరక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. దీని కోసం రూ. 550 కోట్లు వెచ్చిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి తెలిపారు.

బాధ్యతల వికేంద్రీకరణ

ఖరీఫ్ సీజను వరి సేకరణ పురస్కరించుకుని అక్రమాలు అరికట్టేందుకు అధికారులకు పూచీదారితనంతో కూడిన బాధ్యతల్ని వికేంద్రీకరించారు. మండీల్ని జోనులుగా విభజించి సూపర్‌వైజర్లని నియమిస్తారు. జిల్లా కలెక్టరు సమన్వయం, పర్యవేక్షణలో సమగ్ర ప్రక్రియ కొనసాగుతుంది. ఈ ప్రక్రియ పర్యవేక్షణ బాధ్యతల్ని ప్రాంతీయ జిల్లాలకు చెందిన మంత్రులు నిర్వహిస్తారు.

పక్షపాతం నివారణ

వరి సేకరణలో ఎలాంటి పక్షపాతం లేకుండా ఆద్యంతం కొనసాగేలా జిల్లా మేజిస్ట్రేట్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వరి విక్రేతలకు రూ. 800 బోనస్ చెల్లించే ఎన్నికల హామీ అక్షరాల అమలు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఇరుగు పొరుగు చత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల వరి పంట చొరబడకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సరిహద్దు ప్రాంతాల్లో సీసీటీవీ, స్మార్టు కెమెరా వంటి అత్యాధునిక వ్యవస్థతో అక్రమ వరి చొరబాటు అడ్డుకోవాలని తెలిపారు.

అత్యధికులు సన్నకారు రైతాంగం

ఖరీఫ్ సీజను వరి విక్రయం కోసం నమోదు చేసిన వారిలో అత్యధికంగా సన్నకారు రైతులే ఉన్నారు. సుమారు 83.16 శాతం సన్నకారు రైతులుగా గుర్తించారు. వీరు పోగు చేసిన వరి కొనుగోలుకు తొలి ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. విక్రయానికి సిద్ధం చేసిన వరి నాణ్యత సమీక్షించడం అత్యంత కీలకంగా పేర్కొన్నారు. ఈ ప్రక్రియ కోసం అత్యాధునిక పరికరాలతో సంప్రదాయ పద్ధతి కొనసాగిస్తారు. భారీ స్థాయి మండీల్లో అత్యాధునిక వరి నాణ్యత పరికర వ్యవస్థ అందుబాటులో ఉంటుంది. భారత నాణ్యత మండలి క్యూసీఐ మార్గదర్శకాల ప్రకారం నాణ్యత నిర్ధారించిన మేరకు వరి కొనుగోలు చేస్తారు. దాదాపు 2,000 భారీ స్థాయి మండీలు ఏర్పాటు చేస్తారు.

న్యూస్‌రీల్

నడిరోడ్డుపై యువకుడి దారుణహత్య



మృతుడు కిరణ్ గదవ (ఫైల్)

కొరాపుట్: నబరంగ్‌పూర్ మెయిన్ రోడ్డులో ఓ యువకుడిని ప్రత్యర్థులు దారుణంగా హతమార్చారు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. కొన్నాళ్లుగా స్థానిక దండాసి వీధి, సౌరావీధి యువకుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి మున్సిపల్ కార్యాలయం వద్దకు ఇరువర్గాలు చేరుకుని దాడులకు తెగబడ్డాయి. ఈ ఘటనలో దండాసి వీధికి చెందిన కిరణ్ గదవ (16) అక్కడికక్కడే మృతి చెందగా, తేజి హరిజన్ అనే బాలుడు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 10 మందిని అదుపులోకి తీసుకున్నారు.

దేవాలయం స్టోర్ రూమ్‌లో అగ్ని ప్రమాదం



అగ్ని మంటల్లో స్టోర్ రూమ్

జయపురం: పూర్ణఘడ్‌లోని దక్షిణ కాళీ దేవాలయం స్టోర్ రూమ్ సోమవారం రాత్రి అగ్ని ప్రమాదానికి గురయ్యింది. మందిర ప్రాంగణంలోని స్టోర్ రూమ్‌లో ఉన్న కొబ్బరి కాయలు, నెయ్యి, మొదలగు పూజా సామగ్రి అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయాయి. రాత్రి 9.45 గంటల సమయంలో స్టోర్ రూమ్ నుంచి మంటలు రావడం గమనించిన ఒక దుకాణదారుడు వెంటనే అందరికీ తెలియజేశాడు. వారు వెంటనే అగ్నిమాపక విభాగానికి ఫోన్ ద్వారా తెలిపారు. అగ్నిమాపక విభాగ సిబ్బంది వచ్చి దాదాపు ఒక గంట సమయంలో మంటలను ఆర్పారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా స్టోర్ రూమ్‌లో అగ్ని ప్రమాదం సంభవించినట్లు అనుమానిస్తున్నారు.

నాటుసారా బట్టీలపై దాడులు



ధ్వంసమైన నాటుసారా బట్టీలు

జయపురం: స్థానిక ఎక్సైజ్ సిబ్బంది, ఎక్సైజ్ ఫ్లయింగ్ స్క్వాడ్‌లు సంయుక్తంగా జయపురం సమితి కదమగుడ ప్రాంతాల్లో సారాబట్టీలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శశికాంత దాస్ మంగళవారం వెల్లడించారు. కొంగా పంచాయతీ కదమగుడ పరిసర అటవీ ప్రాంతాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న సారా బట్టీలపై దాడులు జరిపి, 250 లీటర్ల వండిన నాటు సారా, సారా తయారీకి సిద్ధం చేసిన 3 వేల లీటర్లకు పైగా ఇప్ప ఊటలను పారవేశామని తెలిపారు. వాటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందన్నారు. ఎక్సైజ్ సిబ్బందిని చూసిన మాఫియా వ్యక్తులు పరారైనట్లు వెల్లడించారు. దాడుల్లో డీఎఫ్ఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర పాడియారి, ఇన్‌స్పెక్టర్ శశికాంత దత్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ మద్యం స్వాధీనం



నిందితుడు ధనుర్జయతో పాటు సీజ్ చేసిన మద్యం, బైక్

జయపురం: ఒక బైక్ మీద అక్రమంగా తరలిస్తున్న విదేశీ మద్యం సీజ్ చేసినట్లు జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ బ్లాక్ ఎక్సైజ్ అధికారి భగవాన్ మహానందియ మంగళవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. భగవాన్ మహానందియతో పాటు కానిస్టేబుళ్లు రఘునాథ్ సాంత, హీరామణి భొత్ర తదితరులు దిగాపూర్ మార్గంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఒక వ్యక్తి బైక్‌పై అతివేగంగా వస్తుండగా అనుమానంతో ఆపారు. ఆపిన బైక్‌పై మూడు అట్ట డొక్కులు ఉండడంతో వాటిని పరిశీలించగా విదేశీ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. మొత్తం 30 లీటర్ల మద్యం ఉందని పేర్కొన్నారు. దీంతో నిందితుడు రంగిణిగుడ గ్రామానికి చెందిన ధనుర్జయ చలాన్‌పై కేసు నమోదు చేసి, బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

పట్టాలు తప్పిన సరుకు రవాణా రైలు



పట్టాలు తప్పిన రైలు

భువనేశ్వర్: ఆగ్నేయ రైల్వే ఖరగ్‌పూర్ మండలంలో సరుకు రవాణా రైలు పట్టాలు తప్పింది. దీంతో ఈ మార్గంలో రైలు రవాణా స్వల్పంగా ప్రభావితం అయింది. మండల రైల్వే అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో సాంకేతిక నిపుణుల బృందం ఘటనా స్థలం ప్రత్యక్షంగా సందర్శించి పరిస్థితిని చక్కదిద్దింది. మయూర్‌భంజ్ జిల్లా బరిపద నుంచి ఖనిజ పదార్థాల లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు వ్యాగన్ చక్రాలు పట్టాలు తప్పడంతో ఈ ప్రమాదం సంభవించింది. రైలు రవాణాకు అంతరాయం ఏర్పడడంతో బంగిరిపోషి-రుప్సా డెమూ రైలు సేవల్ని రద్దు చేశారు.

యువతిపై లైంగికదాడి



మోటు పోలీసుస్టేషన్

మల్కన్‌గిరి: కలిమెల సమితి మోటు పోలీసుస్టేషన్ పరిధిలో గల ఎంవీ 80 గ్రామంలో అశోక్ సర్కార్ అనే యువకుడు ఓ యువతిపై శనివారం లైంగిక దాడికి పాల్పడ్డాడు. దసరా నాడు ఎవరూ లేని సమయం చూసుకుని ఇంటికి వెళ్లి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి కొన్నాళ్ల కిందట చనిపోయారు. ఆమె తండ్రితో కలిసి ఉంటోంది. ఆయన చేపల వేటకు వెళ్లిపోవడంతో అశోక్ ఇంటిలోకి ప్రవేశించి దారుణం చేశాడు. జరిగిన విషయాన్ని తండ్రికి చెప్పలేక యువతి కుమిలిపోయింది. అయితే ఆమె నీరసంగా ఉండడంతో తండ్రి మరో మహిళ ద్వారా ఆరా తీయించగా విషయం వెలుగుచూసింది. దీంతో ఆయన సోమవారం పోలీసులను ఆశ్రయించారు. యువతిని ఆరోగ్య పరీక్షల నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

అల్లరి కొండముచ్చు ఆటకట్టు



మత్తులో బందీ అయిన కొండముచ్చు

భువనేశ్వర్: కటక్ జిల్లా అతొగొడా అటవీ ప్రాంతం పరిసరాల్లో అలజడి రేపిన కొండముచ్చుని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఘండికల్ గ్రామంలో ఈ కొండముచ్చు దాడిలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దీని భయంతో గడప దాటేందుకు కూడా భయపడ్డారు. విషయం తెలియడంతో అటవీ శాఖ అధికారుల చొరవతో స్థానిక నందనకానన్ నుంచి ప్రత్యేక నిపుణుల బృందం రంగంలోకి దిగి అల్లరి కొండముచ్చుపై మత్తు ప్రయోగించి అదుపులోకి తీసుకుంది. దీన్ని సురక్షితంగా అనుకూలమైన అటవీ ప్రాంతంలో విడిచి పెట్టడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

బైక్ ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాద స్థలంలో పడి ఉన్న బాబూరావు బైక్

మల్కన్‌గిరి: చిత్రకొండ సమితి కప్పతూట పంచాయతీ కమలపోధర్ గ్రామం వద్ద గల్లి బాబూరావు (30) అనే వ్యక్తి బైక్ ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కమలపోధర్ గ్రామం నుంచి మంగళవారం ఉదయం దేవఖోరతో కలిసి బైక్‌పై చిత్రకొండకు వచ్చారు. స్నేహితుడిని అక్కడ వదిలి తిరిగి వస్తుండగా బోడపోదర్ పంచాయితీ మంజగూడ హైస్కూల్ సమీపంలో బైక్ అదుపు తప్పి వంతెనపై నుంచి పడిపోయింది. స్థానికులు గమనించి ఆయనను అంబులెన్స్‌లో చిత్రకొండ ఆరోగ్యకేంద్రానికి తరలించారు. బాబూరావు స్వస్థలం డైక్ 3 గ్రామం. చిత్రకొండ పోలీసులు ఆరోగ్య కేంద్రానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు.

ట్రక్కును ఢీకొట్టిన బస్సు

- హెల్పర్‌కు గాయాలు



నుజ్జు అయిన బస్సు

భువనేశ్వర్: ట్రక్కుని బస్సు ఢీకొట్టిన ఘటనలో హెల్పరు తీవ్రంగా గాయపడ్డాడు. కటక్ సమీపంలో మంగళవారం ఉదయం ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఫుల్బాణి నుంచి కటక్ వస్తుండగా తెలంగాపెంట ప్రాంతంలో ట్రక్కుని ఢీకొంది. అదృష్టవశాతు హెల్పరు మినహా బస్సులో మిగిలిన వారంతా సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన హెల్పరుని స్థానిక ఎస్‌సీబీ వైద్య బోధన ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జు అయింది. కటక్ సదరు ఠాణా పోలీసులు ప్రమాదానికి కారణమైన బస్సుని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27 నుంచి కొరాపుట్ పరబ్ ఉత్సవాలు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

కొరాపుట్: రాష్ట్ర స్థాయి కొరాపుట్ జిల్లా గిరిజన సాంస్కృతిక ఉత్సవాలు ఈ నెల 27 నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లా కేంద్రంలో కలెక్టర్ వీ.కీర్తివాసన్ అధ్యక్షతన మంగళవారం పరబ్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమిలిగుడ సమితి దుదారి వద్ద మా మౌళిమా అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమవుతాయని చెప్పారు. గ్రామ, సమితి, డివిజన్, జిల్లా స్థాయి ఉత్సవాలు జరుగుతాయని వివరించారు. డిసెంబర్ 14 నుంచి 18 వరకు జిల్లా కేంద్రానికి సమీపంలో రంగబాలి కుంభ సమీపంలో నూతన పరబ్ గ్రౌండ్‌లో రాష్ట్ర స్థాయి ముగింపు ఉత్సవాలు జరుగుతాయని వెల్లడించారు. వీటికి వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులు తరలివస్తారని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు తారాప్రసాద్ బాహీనీపతి (జయపూర్), రామ్‌చంద్ర ఖడం(పొట్టంగి), రఘురాం మచ్చో (కొరాపుట్), ఎస్పీ రోహిత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: కూరగాయాలను అమ్మేందుకు సంతకు వెళ్లి నదిలో గల్లంతైన వృద్ధురాలి మృతదేహం సోమవారం సాయంత్రం లభ్యమైంది. వృద్ధురాలు బొయిపరిగుడ సమితి దిగాపూర్ గ్రామ పంచాయతీ కావుకుండ గ్రామానికి చెందిన పులక ఖొర(65)గా పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం సంతకు పుక ఖొర కూరగాయలు అమ్మేందుకు వెళ్లింది. సంత ముగిసిన తర్వాత ఇంటికి అవసరమైన సామాన్లు కొని తిరిగి వస్తుండగా మార్గంలో ఉన్న నది దాటేందుకు ప్రయత్నం చేసింది. అయితే నదిలోతు ఎక్కువ ఉండడంతో మునిగిపోయింది. రాత్రి అయినా పుక ఖొర ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో గాలించారు. నదిలో మునిగిపోయిందనే అనుమానంతో గాలించారు. అయితే ఆమె జాడ తెలియలేదు. మరో మార్గంలేక బొయిపరిగుడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక సిబ్బందితో పోలీసులు నదీ ప్రాంతానికి వచ్చి గాలించగా ధరమఘడ్ ప్రాంతంలో పుక ఖొర మృతదేహం తేలుతూ కనిపించింది. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టంకి తరలించారు. అనంతరం ఆమె బంధువులకు అప్పగించారు. తమ గ్రామానికి రోడ్డు లేదని, అందువలన ఎక్కడికి వెళ్లాలన్నా నదిని దాటాల్సిందేనని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. ఇలా నది దాటుతూ అనేక మంది అకాల మృత్యువాత పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నదిపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం



పోస్టుమార్టం కోసం లులు జాని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

జయపురం: జయపురం సదర్ పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్రతండి మంగళవారం తెలిపారు. మరణించిన వారిలో జయపురం సమితి అంత పంచాయతీ సునారీగుడ గ్రామానికి చెందిన లులు జాని (32), కుంద్రా సమితి పపుగాం పంచాయతీకి చెందిన మకర మాలీ(19) ఉన్నట్లు చెప్పారు. కందులుగుడ గ్రామానికి చెందిన నవీన భూమియ (30) తీవ్రంగా గాయపడినట్లు పేర్కొన్నారు. క్షతగాతుడిని చికిత్స కోసం కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించామన్నారు. రెండు ప్రమాదాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఈశ్వర తండి వెల్లడించారు. కుంద్ర సమితి కుందులుగుడకు చెందిన మకర మాలి, నవీన భూమియ ద్విచక్ర వాహనంపై బొరిగుమ్మ వెళ్లి పనులు ముగించుకొని తిరిగి సోమవారం రాత్రి పది గంటల సమయంలో ఇంటికి వస్తుండగా.. 26వ జాతీయ రహదారి అంబాగుడ పోలీసు పంటి సమీపంలో బైక్ అదుపు తప్పడం ప్రమాదం చోటుచేసుకుంది. సమీపంలో ఉన్న పోలీసులు చూసి తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అయితే వీరిలో మకర మాలీ అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. నవీన పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స జరిపి కొరాపుట్ తరలించారు. మరో సంఘటన జయపురం సమీప భూతనాద్ శ్మశానవాటిక సమీపంలోని బిహారీ బట్టీ వద్ద జరిగిందని వెల్లడించారు. సునారీగుడ లులు జాని బైక్‌పై జయపురం నుంచి వస్తుండగా సారా బట్టీ సమీపంలో మరో బైక్‌తో ఢీ కొట్టింది. ఈ సంఘటనలో లులు జాని మరణించినట్టు పోలీసులు పేర్కొన్నారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ సులోచన ప్రధాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏనుగు విధ్వంసం



ఏనుగు జాడను పరిశీలిస్తున్న అధికారులు



కూరగాయలను ధ్వంసం చేసిందని చూపిస్తున్న రైతు



ఒకిలుగుడ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగు (వృత్తంలో)



కరణగుడలో అటవీ శాఖ సిబ్బంది

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ పరిసర ప్రాంతాలైన కరణగుడ, ఒకిలుగుడలో ఏనుగు విధ్వంసం సృష్టించింది. సోమవారం సాయంత్రం ఆయా ప్రాంతాల్లోని వరి, కూరగాయల పంటలను ధ్వంసం చేయడంతో పాటు కరణగుడలో గొట్టపు బావిని విరగ్గొట్టింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. సమాచారం తెలుసుకున్న అటవీ, విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలాలకు చేరుకుని ఏనుగు ఆచూకీ కోసం అన్వేషణ ప్రారంభించారు. అటవీ శాఖ రేంజర్ గంగాధర్ మిశ్రో తెలియజేసిన వివరాల ప్రకారం.. కొద్ది నెలల క్రితం పొరుగు రాష్ట్రమైన ఆంధ్రాకు చెందిన భామిని తదితర అటవీ ప్రాంతాల నుంచి 5 ఏనుగుల గుంపు గుణుపూర్ అటవీ ప్రాంతాలకు చేరుకున్నాయి. అయితే ఇటీవల కాలంలో గుంపులో ఉన్న నాలుగు ఏనుగులు మృతి చెందాయి. దీంతో ఇందులో ఒక్కటి ఏకాకిగా మిగిలిపోవడంతో దిక్కుతోచని స్థితిలో అటూఇటూ తిరుగుతూ పంట పొలాలను ధ్వంసం చేయడంతో పాటు, నానా బీభత్సాన్ని సృష్టిస్తోందన్నారు. ప్రస్తుతం ఈ ఏనుగు కరణగుడ, ఒకిలుగుడ పరిసరాల్లో సంచరిస్తుందన్న సమాచారం అందుకుని తమ సిబ్బంది సంఘటన స్థలంకు చేరుకుందని చెప్పారు. సాయంత్రం సమయంలో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు బయట తిరగకూడదని అవగాహన కల్పిస్తున్నారు. అయితే ప్రజలు భయాందోళనలకు గురవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఏది ఏమైనప్పటికీ ఎప్పుడు ఎటువంటి ఉపద్రవం ముంచుకొస్తుందోననే భయాందోళనలతో ప్రజలు కాలం గడుపుతున్నారు.

క్లుప్తంగా

తాగుదామని పిలిచి చంపేశారు


హత్యకు గురైన మిలన్ మజుందార్ మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి ఎంవీ8 గ్రామంలో సోమవారం రాత్రి మిలన్ మజుందార్(45) అనే వ్యక్తిని దారుణంగా గొంతు కోసి హతమార్చారు. మందు తాగుదామని పిలిస్తే వెళ్లిన మజుందార్ అక్కడ శవమై తేలాడు. వివరాల్లోకి వెళితే.. మజుందార్‌ను సోమవారం తోటి గ్రామస్తులు మద్యం తాగుదామని పిలిస్తే వెళ్లాడు. మంగళవారం ఉదయం గ్రామ శివార్లలోని పొలాల్లో అతని మృతదేహం కనిపించింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న మల్కన్‌గిరి ఐఐసీ రిగాన్ కిండో తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ కొన్ని మద్యం బాటిళ్లు, కూల్‌డ్రింక్ బాటిళ్లు ఉన్నాయి. మద్యం మత్తులో హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు. మృతదేహాన్ని మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రైలు ఢీకొని గున్న ఏనుగు మృతి


ప్రాణాలు కోల్పోయిన గున్న ఏనుగు

భువనేశ్వర్: రైలు ఢీకొని గున్న ఏనుగు ప్రాణాలు కోల్పోయింది. పట్టాలు దాటుతున్న ఏనుగుని సరుకు రవాణా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదం హౌరా – ముంబై రైలు మార్గంలో బండాముండా రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రౌర్కెలా పరిసర ప్రాంతాల్లో చొరబడిన ఏనుగుల గుంపుని తరలిస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. స్థానికుల సమాచారంతో ఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనపై విచారణ ప్రారంభించారు. ఏనుగులు సంచరించే పరిధిలో వేగ నియంత్రణతో రైళ్లు నడపాలనే నిబంధన అమలు, ఆచరణ దిశలో విచారణకు శ్రీకారం చుట్టారు. పట్టాల పరిసరాల నుంచి గున్న ఏనుగు కళేబరం తొలగించేంత వరకు రైళ్ల వేగం నియంత్రించి నడిపించాలని ఆదేశించారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

- 9 మంది అరెస్టు


పట్టుబడిన జూదరులు

జయపురం: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేశారు. మంగళవారం రాత్రి ఏడు గంటల సమయంలో జయపురంలోని రెండో దైనిక బజారులోని పేకాట శిబిరంపై పట్టణ పోలీసులు దాడి జరిపారు. ఈ ఘటనలో తొమ్మిదిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 12,980 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ పోలీసు అధికారి రమణి రంజన్ దొలాయి తెలిపారు.

దేవీ నిమజ్జనంలో అపశ్రుతి

- విగ్రహం కిందపడి యువకుడి మృతి


నవీన్ (ఫైల్)

రణస్థలం: దుర్గాదేవి నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. విగ్రహం కింద పడి ఓ యువకుడు మృతిచెందాడు. జే.ఆర్.పురం పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రణస్థలం మండలం అక్కయ్యపాలెంలోని యర్ర చెరువులో సోమవారం రాత్రి 11 గంటల సమయంలో దుర్గాదేవి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన దాన నవీన్ (21) ప్రమాదవశాత్తు విగ్రహం కింద పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ గుర్తించలేదు. పక్క గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నందున అక్కడికి వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. వేకువజాము 3 గంటల వరకు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి వెతికారు. చెరువులో నిమజ్జనం చేసిన విగ్రహాన్ని లేపగా అక్కడే నవీన్ కుమార్ కూరుకుపోయి ఉన్నాడు. దీంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. నవీన్ ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జే.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి, సిబ్బంది వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి దాన లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


కొత్త నిబంధనలతో ఇబ్బందులు


ఒడిశా విత్తన ఉత్పాదక నిగమ్ వద్ద ఆందోళనలో గజపతి రైతులు


గజపతి జిల్లా వ్యవసాయ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం నాయకులు సూర్యనారాయణ పట్నాయిక్

పర్లాకిమిడి: ఒడిశా రాష్ట్ర విత్తన నిగమ్ లిమిటెడ్ విత్తన విక్రయాలకు కొత్త నిబంధనలు పెట్టడంతో నష్టాలు వస్తున్నాయని గజపతి జిల్లా రైతు సంఘం నాయకులు సూర్య నారాయణ పట్నాయిక్ మండిపడ్డారు. రైతులతో కలిసి ఆయన మంగళవారం జిల్లా వ్యవసాయాధికారిని కలిసి మాట్లాడారు. కొత్త నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుంచి హెక్టార్‌కు 15 నుంచి 20 క్వింటాళ్లు మాత్రమే ప్రభుత్వ విత్తన నిగమ్ లిమిటెడ్‌కు అమ్ముకునే వీలుంది. మిగతా ధాన్యం మండీల్లో అమ్ముకునే హక్కును రైతు కోల్పోతున్నారని నాయకులు ఆరోపిస్తున్నారు. ఒక హెక్టారుకు 50 నుంచి 60 బస్తాల ధాన్యం రైతు పండిస్తే అధికారులు అన్ని పరీక్షలు చేసి 15 క్వింటాళ్లు తీసుకుంటారని, మిగతా ధాన్యం ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నిస్తున్నారు. ఈ కొత్త జీఓను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

బాలి జాతరకు సన్నాహాలు


బాలి జాతర తోరణం

భువనేశ్వర్: ఈ ఏడాది బాలి జాతర అట్టహాసంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇరుగు పొరుగు దేశాలతో నావికా వ్యాపారానికి ప్రతీకగా ఏటా ఈ జాతర నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ ఏడాది జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు జగత్‌సింగ్‌పూర్ లోక్‌సభ సభ్యుడు బిభు తొరై తెలిపారు. పారాదీప్ ప్రాంతంలో బాలి జాతర సన్నాహక సమావేశానికి హాజరు అయిన సందర్భంగా మంగళవారం ఈ విషయం వెల్లడించారు.

శభాష్ పోలీస్!


సిబ్బందికి రివార్డు అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

సమయం: సోమవారం అర్ధరాత్రి ఒంటి గంటన్నర
ప్రదేశం: పొన్నాడ వంతెన
ఏం జరిగిందంటే: ఓ యువకుడు బ్రిడ్జి పైనుంచి దూకేందుకు సిద్ధమవుతుండగా అటువైపుగా నైట్‌బీట్ విధులు నిర్వర్తిస్తున్న నైట్‌బీట్ పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే..

శ్రీకాకుళం నగరంలోని మావూరివీధికి చెందిన గుంటముక్కల శివప్రసాద్ కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. సోమవారం అర్ధరాత్రి పొన్నాడ వంతెన వద్ద నదిలో దూకేందుకు ప్రయత్నిస్తుండగా అదే సమయంలో ఒకటో పట్టణ నైట్‌బీట్ తనిఖీ అధికారి టి.అమ్మాజీ అడ్డుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యకు చావు ఒక్కటే పరిష్కారం కాదని, క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పి.. అనంతరం పోలీసు వాహనంపై అతన్ని ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి వ్యక్తి ప్రాణాలు కాపాడిన హెచ్‌సీ అమ్మాజీ, ఆర్మ్‌డ్ రిజర్వ్ పీసీ చంద్రశేఖర్, మహిళా హోంగార్డు నారాయణమ్మలను ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వారికి నగదు పురస్కారాన్ని సైతం అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీ వివేకానంద, సీఐ పైడపునాయుడు, ఎస్ఐ హరికృష్ణ ఉన్నారు.

– శ్రీకాకుళం క్రైమ్

సంప్రదాయాలను పరిరక్షించాలి



కార్యక్రమంలో పాల్గొన్న భారతీ పాణిగ్రాహి, ఇతిశ్రీ మహాపాత్రో తదితరులు

పర్లాకిమిడి: సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. పర్లాకిమిడిలోని మహారాజా ప్యాలెస్ యూటెక్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో మంగళవారం ప్రగతి మహిళా సంఘటన్ ఆధ్వర్యంలో కుమార ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ భారతీ పాణిగ్రాహి, ఇతిశ్రీ మహాపాత్రో, హరిమోహన్ పట్నాయక్, అంజనా పట్నాయక్‌లు మాట్లాడుతూ కుమార పౌర్ణమి పండుగ నాడు మహిళలు జల్లెడలో తన భర్త ప్రతిబింబం చూసి తరిస్తారని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన వక్తృత్వ, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రగతి మహిళా ఘటన్ కార్యదర్శి తనూజా శతపతి, అధ్యక్షురాలు కల్పనా పట్నాయక్, బిచిత్రా నంద బెబర్తా తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. చల్లగా చూడమ్మా!



అమలపాడు గ్రామం భక్త జనసంద్రమైంది. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన దుర్గమ్మతల్లి ఘటాల ఉత్సవానికి అశేష జనవాహిని తరలివచ్చింది. దేవీ.. పాహిమాం.. అంటూ భక్తుల శరణు ఘోషతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన పగటి వేషాలు, కాళీమాత వేషధారణలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీ దుర్గాదేవీ లేబర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో 171 మంది మహిళలు ఎరుపు వస్త్రధారణలో ఘటాలతో వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ దున్న రత్నం బాలరాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దున్న వీరస్వామి, కె.లింగరాజు, దుర్గా దేవి లేబర్ యూనియన్ నాయకులు ఇరోతు అప్పన్న తదితరులు పాల్గొన్నారు. – వజ్రపుకొత్తూరు

హబిష్యాలీలకు ప్రత్యేక భద్రత


వినీత్ అగర్వాల్, ఎస్పీ

భువనేశ్వర్: పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని జగన్నాథుని క్షేత్రం పూరీలో హబిష్యాలీల ఆగమనం ఊపందుకుంటోంది. వీరంతా నెల రోజులపాటు కార్తీక వ్రతం ఆచరిస్తారు. స్వామి దర్శనం, మహా ప్రసాదం పంపిణీ, ఉచిత వసతి, రవాణా, వైద్యం తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా పకడ్బందీ భద్రత, రక్షణ చర్యలు చేపడుతున్నట్లు పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంటు వినీత్ అగర్వాల్ తెలిపారు. జగన్నాథుని దర్శనం సందర్భంగా శ్రీ మందిరం సింహద్వారం నుంచి ఆలయం లోపలికి వెళ్లేవరకు తొక్కిసలాట వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 20 ప్లాటూన్ల పోలీసుల్ని మోహరిస్తామని చెప్పారు. ఇద్దరు అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 10 మంది ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షిస్తారని వివరించారు. సింహద్వారం ఆవరణలో పోలీసు కంట్రోల్ రూమ్ పని చేస్తుందని తెలిపారు.

ఘనంగా దుర్గాదేవి అనుపోత్సవం


అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


క్రేన్ సహాయంతో నిమజ్జనాన్ని పూర్తి చేస్తున్న కమిటీ సభ్యులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో దుర్గాదేవి విగ్రహాల అనుపోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. దేవీ శరన్నవరాత్రులు సందర్భంగా మండపాల్లో అమ్మవాని విగ్రహాలను ప్రతిష్ఠించారు. శరన్నవరాత్రులు ముగియడంతో డీఎన్‌కే దండకారణ్య పూజా కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాలను భారీ ఊరేగింపు మధ్య మెయిన్ రోడ్డు గుండా స్థానిక బైరవి మందిరం వద్ద గల చెరువు వద్దకు చేర్చారు. అనంతరం క్రేన్ సహాయంతో విగ్రహాలను చెరువు నీటిలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో అధికసంఖ్యలో భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బెడిసి కొట్టిన రెండో పెళ్లి వ్యూహం


న్యాయస్థానం ఆవరణలో భార్య చేతికి చిక్కిన భర్త

భువనేశ్వర్: రెండో పెళ్లికి సిద్ధమైన ఓ ప్రబుద్ధుడు అడ్డంగా పాలయ్యాడు. కటక్ జిల్లా బంకి న్యాయస్థానం ఆవరణలో మంగళవారం ఈ సంఘటన వెలుగు చూసింది. సంతోష్ రౌత్ అనే వ్యక్తికి పెళ్లయ్యింది. అయితే అతని వేధింపులు తాళలేక ఆమె పోలీసులకు ఫిర్యాదుచేసింది. దీంతో భార్యపై కోపం పెంచుకున్న సంతోష్ మరో పెళ్లి చేసుకునేందుకు ఉద్యుక్తుడయ్యాడు. రిజిస్ట్రార్ సమక్షంలో పెళ్లి చేసుకునేందుకు ఏర్పాట్లు కూడా చేసుకున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న అతని భార్య వెంటనే అక్కడకు వెళ్లి సంతోష్‌ను పోలీసు స్టేషన్‌కు ఈడ్చుకుని వెళ్లింది. కొత్త పెళ్లి కూతురు ఘటనా స్థలం నుంచి ఉడాయించింది.

స్వాభిమాన్ ఏరియాలో మంత్రి పర్యటన


బొడొపాడ పంచాయతీలో ప్రసంగిస్తున్న మంత్రి నిత్యానందో గోండ్


సభకు హాజార్ అయిన గిరిజనులు

మల్కన్‌గిరి: చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా బొడొపాడ పంచాయతీలో రాష్ట్ర షెడ్యూల్ తెగల మంత్రి నిత్యానందో గోండ్ మంగళవారం పర్యటించారు. గత ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. బొడొపాడలో ఎడ్యుకేషన్ కాంప్లెక్స్ పనితీరుపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం చెప్పిన మేరకు పనులేవీ ఇక్కడ జరగలేదని విమర్శించారు.

17 నుంచి వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఏపీ పీజీ సెట్ -2024 ద్వారా రెండు విడతల ప్రవేశాలు తర్వాత మిగిలిన సీట్లకు ఈ నెల 17 నుంచి 21 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో 562 సీట్లకు 243 ప్రవేశాలు జరిగాయని, 319 ఖాళీలు ఉన్నాయని చెప్పారు. పీజీ సెట్ ర్యాంకు ఉన్నవారు మాత్రమే అర్హులని, రూ. 500 దరఖాస్తు రుసుం, ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాల్సిఉంటుందని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లకు ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వంటివి వర్తించవని స్పష్టం చేశారు.

- గత పదేళ్లలో అక్టోబర్– డిసెంబర్ మధ్య 11 తుఫాన్లు
- లోతట్టు ప్రాంతాలకు పొంచి ఉన్న ముప్పు
- మత్స్యకారులు, రైతులకు జాగ్రత్తలు తప్పనిసరి




వరి పైరు

సంవత్సరం	తీరం దాటిన ప్రాంతం	ప్రభావితమైన జిల్లాలు
2014 అక్టోబర్ (హుద్‌హుద్)	విశాఖపట్నం	శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం
2018 అక్టోబర్ (తిత్లీ)	పల్లిసారధి(పలాస)	శ్రీకాకుళం, విజయనగరం
2021 డిశంబరు (పెతాయ్)	కళింగపట్నం	శ్రీకాకుళం,విశాఖ,విజయనగరం

వజ్రపుకొత్తూరు: రోజురోజుకూ మారుతున్న వాతావరణ పరిస్థితులు జిల్లావాసులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. సాధారణంగా అక్టోబర్, నవంబరు నెలల్లో జిల్లాపై తుఫాన్ల ప్రభావం ఎక్కువ. గత పదేళ్లను పరిశీలిస్తే ఏకంగా పది తుఫాన్లు సంభవించాయంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడిందని, ఇది వాయుగుండంగా మారి తీవ్ర తుఫానుగా అవతరించి దక్షిణ కోస్తాతో పాటు మన ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాల కురస్తాయని ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో నువ్వలరేవు, గుణుపల్లి, దేవునల్తాడ, మంచినీళ్లపేట, కంబారాయుడుపేట తీరాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి.

రైతులూ ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 4,66,159.5 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో ప్రధానంగా స్వర్ణ, సాంబమసూరి రకాలే. ప్రస్తుతం పొట్ట దశ నుంచి కంకులు బయటకు వచ్చే దశలో ఉన్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వరి పొలాలు ముంపునకు గురైతే పొల్లు గింజలే తప్ప పంట చేతికి రాదు. కాబట్టి లోతట్టు, ముంపు ప్రాంతాల రైతులు అప్రమత్తంగా ఉండాలి.
- ఒకవేళ వరి చేను ముంపునకు గురైతే ఉప్పుద్రావణం పిచకారి చేయాలి.
- వర్షం పడే సమయంలో నీరు నిల్వ లేకుండా చూడాలి.
- ఈ- క్రాప్ బుకింగ్‌తో పాటు పంటల బీమాలో నమోదు కావాలి.
- పంట నష్టం జరిగితే రైతులు వ్యవసాయ, రెవిన్యూ, ఇతర ఎన్యుమరేషన్ చేసే వారిని సంప్రదించాలి.

మత్స్యకారులూ బహుపరాక్..

- మత్స్యకారులు వలలు, బోట్లను సురక్షిత ప్రాంతాల్లో లంగరు వేసుకోవాలి.
- సముద్రం కల్లోలంగా ఉన్న సమయంలో వేటకు వెళ్లకూడదు.
- వేట సమయంలో లైఫ్ జాకెట్లు, ఇతర రక్షిత పరికరాలు బోట్‌లో ఉంచుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి..



ప్రస్తుతం తుఫాన్ ప్రభావం జిల్లాపై అంతగా ఉండకపోవచ్చు. ఒకవేళ భారీ వర్షాలు వస్తే రైతులు పంటను కాపాడుకునేందుకు సిద్ధం కావాలి. ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి. పంటల బీమా పథకంలో సభ్యులుగా ఉండాలి. వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

– ఎల్.వి.మధు, ఏడీఏ, పలాస

ఏయూ దూరవిద్య స్టడీ సెంటర్ పునఃప్రారంభం

శ్రీకాకుళం:

జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య స్టడీ సర్కిల్ మంగళవారం పునఃప్రారంభమైంది. ఏడాదిన్నర క్రితం ఇక్కడి కేంద్రాన్ని మూసివేశారు. దీంతో జిల్లా విద్యార్థులు వ్యయప్రయాసలకోర్చి విశాఖ వెళ్లాల్సివచ్చేది. పొరుగున ఉన్న ఒడిశా విద్యార్థులకు కూడా జిల్లాలోని స్టడీ సర్కిల్ ద్వారానే దూరవిద్య అందేది. ఏటా సుమారు 300 నుంచి 400 వందల వరకు డిగ్రీ, పీజీ చదువుతుండేవారు. జిల్లాలో అంబేద్కర్ విశ్వవిద్యాలయం ప్రారంభమయ్యాక ఏయూ అధికారులు ఇక్కడి ఏయూ స్టడీ సర్కిల్ ఎత్తివేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక వినతులు అందించడంతో స్టడీ సర్కిల్‌ను పునఃప్రారంచడంతో పాటు ముగ్గురు ఉద్యోగులను డిప్యూటేషన్ ద్వారా నియమించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కన్వీనర్‌గా వ్యవరిస్తారు. గతంలో కోఆర్డినేటర్‌గా పనిచేసిన ఇందువదన బాధ్యతలు స్వీకరించే పక్షంలో ఆమెనే ఆ పోస్టులో కొనసాగిస్తారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ స్టడీ సర్కిల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

చెరకు తోట దగ్ధం



రేగిడిలో కాలిపోయిన చెరకు తోట

రేగిడి: మండల కేంద్రం రేగిడి గ్రామంలో మంగళవారం పలువురి రైతులకు చెందిన చెరకు తోట దగ్ధమైంది. కొక్కురోతు అప్పలనాయుడు, కరణం గోవింద, లావేటి విష్ణు, రుంకు గోవిందరావు, లావేటి రఘురాం, దేవకోటి శ్రీను, దేవకోటి వెంకటరమణ, దేవకోటి భాస్కరరావు, కరణం భాస్కరరావు, అల్లెన మల్లయ్య, శాసుబిల్లి జగన్నాథంనాయుడులకు చెందిన 15 ఎకరాల చెరకు పంట కాలిపోయిందని పాలకొండ ఫైర్ ఎస్ఐ సర్వేశ్వరరావు, రెవెన్యూ అధికారులు తెలిపారు. ప్రమాదం ఎలా సంభవించిందో తెలియరాలేదు. సుమారు రూ.10 లక్షల మేర నష్టం సంభవించిందని రైతులు తెలిపారు. కర్మాగారం, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఐటీఐ సంఘ కార్యవర్గం ఎన్నిక

బొబ్బిలి: ఏపీ ప్రభుత్వ ఐటీఐ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం జరిగింది. జిల్లా అధ్యక్షునిగా బి.అప్పలకొండ, కార్యదర్శిగా టీవీ గిరి, ఉపాధ్యక్షులుగా కె.రాములప్పడు, డి.శేఖర్, జాయింట్ సెక్రటరీలుగా వి.శ్రీనివాసరావు, పీవీ భాస్కర్, కోశాధికారిగా ఎ.రామినాయుడు, ఈసీ మెంబర్లుగా కె.యుగంధర్, కె.ఝాన్సీ రాణి, బి.ధనలక్ష్మి, ఎం.చిన్నారావు ఎన్నికయ్యారు. బొబ్బిలి యూనిట్‌కు సంబంధించి అధ్యక్ష కార్యదర్శులుగా సీహెచ్ రాజు, సీహెచ్ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా వై.మోహన్, కోశాధికారిగా స్వర్ణలత ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి పి.దేముడు, సహాయ అధికారిగా కోట్ల శ్రీనివాసరావు, పరిశీలకుడిగా బి.రామారావులు వ్యవహరించినట్టు నూతన కార్యవర్గం తెలిపింది.

వ్యక్తికి తీవ్ర గాయాలు

బొండపల్లి: వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి ప్రమాదం చోటు చేసుకోవడంతో బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు.. ఎస్.కోట గ్రామంలోని బర్మా కాలనీకి చెందిన తగరంపూడి అప్పారావు తన బైక్‌పై వేగంగా వస్తూ మండలంలోని రోళ్లవాక జంక్షన్ వద్ద గజపతినగరం వైపు నుంచి విజయనగరం వైపు వెళ్తుండగా జాతీయ రహదారి 26పై అదుపు తప్పి బోల్తా పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పారావును 108 వాహనంలో విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

శృంగవరపుకోట: తాత గారింటికి వెళ్లి వస్తానంటూ చెప్పి వెళ్లిన యువతి తిరిగి ఇంటికి చేరకపోవటంతో తండ్రి ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. వేపాడ మండలం రామస్వామిపేట గ్రామానికి చెందిన యువతి ఈ నెల 14వ తేదీన ఉదయం 8.45 గంటల సమయంలో తమ ఇంటి నుంచి బయలుదేరి వీరనారాయణం గ్రామంలో ఉన్న తాత గారింటికి వెళ్లింది. అక్కడ ఎస్.కోట బ్యాంక్‌లో పని ఉందని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వాచ్‌మన్ దుర్మరణం

తగరపువలస: స్థానిక వెంకటేశ్వర మెట్ట వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దాకమర్రి శ్రీను (40) దుర్మరణం చెందాడు. భీమిలి ఎస్ఐ గంటా హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం కొటారుబిల్లికి చెందిన శ్రీను భీమిలి చిన బజారు అప్పికొండవీధి వద్ద బ్లూజే అశోకా స్కైలైన్ అపార్ట్‌మెంట్ వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం తండ్రి సూరి, కుమారులు దీపక్, సందీప్‌లతో కలసి శ్రీను విజయవాడ దుర్గమ్మ దర్శనానికి వెళ్లారు. తిరిగి సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో వెంకటేశ్వరమెట్ట వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతుండగా విజయనగరం వైపు వెళ్తున్న కారు శ్రీనును బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు మండలం కొమడవోలుకు చెందినదిగా గుర్తించారు. మృతునికి భార్య రమణమ్మ ఉన్నారు. మృతుని తండ్రి సూరి ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ డిపోల మంజూరుకు ప్రతిపాదనలు

రాజాం: పట్టణంలో రెండు కొత్త రేషన్ డిపోల మంజూరుకు ప్రతిపాదనలు పంపామని రాజాం సివిల్ సప్లయి డీటీ ఎస్.చిరంజీవి మంగళవారం తెలిపారు. పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా మొత్తం 58 రేషన్ డిపోలు ఉన్నాయన్నారు. వెయ్యి రైస్‌కార్డులు దాటిన డిపోల పరిధిలో విభజన చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో రాజాం మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా రెండు డిపోలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు జోలపేట, మల్లిఖార్జునకాలనీల్లో ఒక్కో రేషన్ షాపు చొప్పున ఏర్పాటు కానున్నాయని, కలెక్టర్ ఆదేశాలతో వాటిని ఏర్పాటు జరుగుతుందన్నారు.

ప్రాణాలు పోతున్నాయి...

- గుర్ల మండలంలో విజృంభించిన డయేరియా
- మంగళవారం ఒక్కరోజే ముగ్గురి మృతి
- భయాందోళనలో ప్రజలు
- డయేరియా లక్షణాలతో 200 మంది మంచాన పట్టిన వైనం
- డయేరియాతో పాటు కిడ్నీ సమస్యలు
- మరికొన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి
- పట్టించుకోని యంత్రాంగం, పాలకులు
- కలెక్టర్‌తో మాట్లాడిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



గుర్ల పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న డయేరియా రోగులు

చీపురుపల్లి/గుర్ల: అక్కడ ఉన్నట్టుండి ఒక్కసారిగా ఏమైందో తెలియదుగాని డయేరియా జడలు విప్పింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఐదు రోజులుగా డయేరియా పడగ విప్పి ప్రజలపై పంజా విసురుతోంది. డయేరియా ధాటికి తట్టుకోలేని గ్రామస్తులు పలువురు మంచాన పట్టగా.. ఇంతవరకు గుర్ల మండల కేంద్రానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. మంగళవారం ఒక్క రోజే ముగ్గురు మృతి చెందారు. దీంతో గుర్ల గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా యంత్రాంగంగాని, అధికార పార్టీ పాలకులుగానీ పట్టించుకున్న పాపానపోలేదు. డయేరియాకు దారి తీసిన పరిస్థితులపై ఆరా తీయాల్సిన వైద్య ఆరోగ్య శాఖ జిల్లా యంత్రాంగం సాదాసీదా చర్యలతో సరిపెట్టుకుంటోంది. మరో వైపు ప్రజలు ప్రాణాలు పోతున్నా, వందల సంఖ్యలో ప్రజలు మంచాన పడుతున్న పరిస్థితుల్లో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ప్రజల ప్రాణాలు రక్షించాల్సిన పాలకులు ఎక్కడున్నారో తెలియని దుస్థితి. గుర్ల మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం గంటల వ్యవధిలో ముగ్గురు చనిపోతే తప్ప ఎమ్మెల్యే రాని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయమై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి అక్కడి పరిస్థితులు చక్కదిద్దాలని కోరారు.

నలుగురు మృతి

గుర్ల మండల కేంద్రంలో గత ఐదు రోజులుగా డయేరియా విజృంభించింది. సోమవారం గుర్లకు చెందిన చింతపల్లి అప్పారావు మృతి చెందగా, మంగళవారం సాయంత్రం 5 గంటల తరువాత గంటల వ్యవధిలో తోంద్రంకి పైడమ్మ, కళిశెట్టి శీతయ్య, సారిక పెంటయ్య మృతి చెందారు. ఇదే గ్రామంలో సుమారు 200 మందికి పైగా డయేరియా లక్షణాలతో బాధపడుతున్నారు. గుర్ల పీహెచ్‌సీ డయేరియాతో బాధపడుతున్న రోగులతో కిటకిటలాడుతోంది. గుర్ల మండల కేంద్రం మాత్రమే కాకుండా అదే మండలంలోని పెనుబర్తి, కెల్ల, కోటగండ్రేడు, ఘోషాడ, పాలవలస తదితర గ్రామాల్లో కూడా డయేరియా లక్షణాలతో చాలా మంది మంచం పట్టారు.

పట్టించుకోని ఎమ్మెల్యే

గుర్ల మండలంలోని పలు గ్రామాల ప్రజలు డయేరియాతో బాధపడుతున్నా ఎమ్మెల్యే కళా వెంకటరావు పట్టించుకోవడం లేదని ఆ పార్టీకి చెందిన స్థానిక నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు తప్ప అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు అనారోగ్యంతో మంచం పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలుంటే అంతా పీఏ చూసుకుంటాడని అతనికి చెప్పాలని ఎమ్మెల్యే తమ పార్టీ శ్రేణులకు చెప్పడంతో స్థానిక టీడీపీ నేతలు సమస్యల గురించి చెబుతున్నారు. అయితే ఎమ్మెల్యే పీఏకి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజల విషయం చెబుతుంటే తనకేంటి లాభం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని టీడీపీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు.



గుర్ల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అత్యవసర మెడికల్ క్యాంప్

డయేరియా నుంచి డయాలసిస్ లక్షణాలకు..

డయేరియా లక్షణాలతో వ్యాధి బారిన పడుతున్న కొంతమందిని గుర్ల నుంచి విజయనగరం తరలించగా అక్కడి నుంచి విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాలని జిల్లా కేంద్రంలోని మహరాజ ఆస్పత్రిలో రిఫర్ చేస్తున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే పెనుబర్తి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి విశాఖపట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రూ.2.5 లక్షలు బిల్ అయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. డయేరియా లక్షణాల నుంచి డయాలసిస్ వరకు ఎందుకు అవసరమవుతోందని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ప్రశ్నిస్తే ఇతర సమస్యలతో చనిపోతున్నారు తప్ప డయేరియాతో కాదని సమాధానం దాట వేస్తుండడం గమనార్హం.

మద్యం దుకాణం పెడితే ఖబడ్దార్

- మహిళల నిరసన



సతివాడ మద్యం దుకాణం వద్ద నిరసన తెలియజేస్తున్న మహిళలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రెల్లిపేటలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఊరుకోబోమని సతివాడ గ్రామానికి చెందిన పలువురు మహిళలు హెచ్చరించారు. సతివాడలోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద మహిళలు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ రెల్లిపేట సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వలన వందలాది కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమీపంలోనే మద్యం షాపు ఉండడం వలన తమ ఇంటి యజమానులు కష్టార్జితాన్ని మద్యం తాగేందుకు వెచ్చిస్తున్నారని, అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. చిన్న పిల్లలు సైతం చెడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మందు బాబులు నిత్యం తగాదాలు సృష్టిస్తూ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని వాపోయారు. సమీపంలోనే ప్రభుత్వ ఆస్పత్రి, ఆదర్శ పాఠశాల, ఉన్నత పాఠశాల, బాలికల వసతిగృహాలు ఉన్నాయని, వాటిని దృష్టిలో పెట్టుకొని రెల్లిపేటలో మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చూడాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇప్పటికే గ్రీవెన్స్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. రెల్లిపేటలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అష్ట దిగ్బంధం

- అడుగడుగునా పోలీస్ ఆంక్షలు
- ఆలయం ఆవరణలో భక్తులపైన దురుసుతనం
- ఉత్సవం పూర్తయిన గంట వరకూ తెరవని గేట్లు
- అవస్థలు పడిన భక్తులు

విజయనగరం క్రైమ్: పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. సిరిమాను రూపంలో కొలువైన అమ్మవారిని కనులారా వీక్షించేందుకు భక్తులను లోపలికి రానీయకుండా పోలీసులు అష్ట దిగ్బంధం చేశారు. ఎక్కడికక్కడే నిలుపుదల చేసి తమ పట్ల కటువుగా ప్రవర్తించారని భక్తులు తమ బాధను వ్యక్తం చేశారు. సిరిమాను తిరిగే ప్రదేశాలైన సింహాచలం మేడ, జామియా మసీదు వరకూ మరో వైపు గుమ్చీ రోడ్డు, శివాలయం వీధి, గంటస్తంభం రోడ్డు తదితర ప్రాంతాలకు వెళ్లే దారులన్నీ ముందస్తుగా రెండు గంటల ముందే మూసివేయడంతో బారికేడ్లలో భక్తుల సందడి తగ్గిపోయింది. ఎస్పీ వకుల్ జిందల్ అధికారులకు, సిబ్బందికి భక్తజనం పట్ల గౌరవభావంతో మెలగాలని సూచించినా.. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బంది తమ ఓవర్ యాక్షన్‌తో ఇబ్బంది పెట్టడంతో భక్తజన సందోహం తీవ్ర నిరాశకు గురై చేసేది లేక తిరుగుముఖం పట్టారు.

ఐదున్నర గంటలకు ఉత్సవం ముగిసినప్పటికీ..

సాయంత్రం ఐదున్నర గంటలకే ఉత్సవం ముగిసినప్పటికీ పలు కారణాల రీత్యా గంట సమయానికి పైగా ప్రధాన రోడ్లపై వేసిన గ్రిల్స్‌ను పోలీసులు తొలగించలేదు. దీంతో సింహాచలం మేడ నుంచి కోట వైపు వచ్చే ప్రజలందరూ తీవ్ర అవస్థలు పడ్డారు. అటువైపుగా వచ్చిన 108 వాహనాన్ని కూడా తిరిగి వెనక్కే పంపేశారు. లోపల నుంచి బయటకు వెళ్లాలన్నా, బయట నుంచి లోపలకి రావాలన్నా పోలీసుల ఆంక్షల నేపథ్యంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో భక్తులు ఎక్కడికక్కడే నిలిచిపోయిన పరిస్థితి కనిపించింది.

అపార్ ఐడీతో విద్యార్థుల కష్టాలకు చెక్

- జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్

రామభద్రపురం: అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ ద్వారా విద్యార్థుల కష్టాలకు చెక్ పెట్టవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తరగతుల నిర్వహణతో పాటు అపార్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రాన్ని పరిశీలించి, కాసేపు మాట్లాడారు. వన్ నేషన్ - వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా జాతీయ స్థాయిలో ప్రతీ విద్యార్థికి ఒక్కో గుర్తింపు నంబర్ కేటాయించి, వారి చదువు కొనసాగినంత కాలం వారి చదువుకు సంబంధించిన సమాచారాన్ని నిక్షిప్తం చేస్తారన్నారు. దీని ద్వారా విద్యార్థుల ధ్రువపత్రాల సమస్యలతో పాటు డ్రాపౌట్‌ల(బడి మధ్యలో మానేసిన పిల్లలు) గుర్తింపు, పర్యవేక్షణ, చదువుకు తగ్గ అవకాశాల రూపకల్పనకు ఈ అపార్ నమోదు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. తొలుత 9, 10వ తరగతుల విద్యార్థుల వివరాలు నమోదు చేయడం జరుగుతోందని చెప్పారు. ఒక విద్యార్థికి 12 అంకెల నంబర్‌తో డిజిటల్ గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్డులోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు జాతీయ స్థాయిలో ఏ విద్యార్థి విద్యకు సంబంధించిన సమాచారం అయినా ఇట్టే తెలిసిపోతుందన్నారు. ఉపకార వేతనాలు, ధ్రువపత్రాలు, ఆధార్ అనుసంధానం, ఉద్యోగాల భర్తీ వంటి సందర్భాల్లో ఈ అపార్ ఐడీ కీలకం కానుందన్నారు. అపార్ నమోదులో మంగళవారం ఉదయం 10 గంటల సమయానికి జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. జిల్లాలో 48,033 మంది విద్యార్థులకుగాను 8331 మందికి అపార్ రిజిస్ట్రేషన్ చేసి 17.34 శాతంతో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో మెంటాడ మండలం 35.26 శాతంతో ప్రథమ స్థానంలో ఉండగా, సంతకవిటీ మండలం 3.59 శాతంతో ఆఖరి స్థానంలో ఉందన్నారు. అపార్ రిజిస్ట్రేషన్ నమోదు వేగవంతానికి ప్రధానోపాధ్యాయులే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. వేగవంతంగా అపార్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులున్నా తమను సంప్రదించాలని ఆయన ప్రధానోపాధ్యాయులకు సూచించారు. అందరి సహకారంతోనే ఇది వేగవంతంగా పూర్తి చేయగలుగుతామనా చెప్పారు. ఆయన వెంట మండల విద్యా శాఖాధికారి పెంటయ్య పాల్గొన్నారు.

సంగంవలస సర్పంచ్ మృతి



బడే చిట్టినాయుడు (ఫైల్)

పార్వతీపురం: మండలంలోని సంగంవలస పంచాయతీ సర్పంచ్ బడే చిట్టినాయుడు(75) అనారోగ్యం కారణంగా మంగళవారం సాయంత్రం స్వగృహంలో మృతి చెందారు. ఈయన ఎన్నో సంవత్సరాలుగా గ్రామ పెద్దగా వ్యవహరించి గతంలో ఒకసారి సర్పంచ్‌గా బాధ్యతలను నిర్వహించారు. 2019 ఎన్నికల్లో పంచాయతీ సర్పంచ్‌గా రెండవసారి ఎన్నికయ్యారు. ఈయన గ్రామంలోని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశారు. ఈయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తదితరులు సంతాపం తెలిపారు.

బాణసంచా పేలి పలువురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు నారాయణమ్మ



బాధితులు వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

సంతకవిటి : మండలంలోని పొనుగుటివలస గ్రామంలో గ్రామదేవత ఉత్సవాల్లో బాణసంచా పేలి పలువురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం గ్రామదేవత అసిరితల్లి ఉత్సవాలు నిర్వహించారు. ముర్రాటలతో మహిళలు, గ్రామస్తులు ఊరేగింపుగా గుడికి వెళ్తున్న సమయంలో చుంచుబుడ్డీలు వెలిగించారు. వీటి నిప్పులు పక్కనే ఉన్న తారాజువ్వల మీద పడడంతో వాటికి నిప్పు అంటుకుని జువ్వలు మొత్తం పేలడం ప్రారంభించాయి. ఇవి దగ్గర్లోని మీసాల నారాయణమ్మ ఇంట్లోకి చొరబడి పేలడంతో ఆ ఇంట్లో ఆ సమయంలో ఉన్న మీసాల నారాయణమ్మతో పాటు అక్కడ మాట్లాడుతున్న మీసాల సూరీడమ్మ, మీసాల తవిటినాయుడు, మీసాల ఉమాదేవి, శాసపు రాజేశ్వరి, వంజరాపు రామినాయుడు గాయాల పాలయ్యారు. వీరిలో రాజేశ్వరికి తీవ్ర గాయాలు కావడంతో జీఎంఆర్ కేర్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారంతా చిన్నచిన్న గాయాలతో రాజాం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన సమాచారంతో సంతకవిటి పోలీసులు రాజాంలోని ఆస్పత్రులకు చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



సామంతుల హారిక



రౌతు జాహ్నవి

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తోండ్రంగి ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినిలు జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం కడలి రమేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఇటీవల బాపట్ల జిల్లా జె.పంగులూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో 9వ తరగతి విద్యార్థిని సామంతుల హారిక, అండర్-18 విభాగంలో పదో తరగతి విద్యార్థిని రౌతు జాహ్నవి ఉత్తమ ప్రతిభ కనబరిచారని చెప్పారు. వీరు ఈ నెల 18 నుంచి తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో జరగనున్న ఖేలో ఇండియా ఖోఖో పోటీల్లో రాష్ట్ర జట్ల తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని పేర్కొన్నారు. విద్యార్థినిలను, పీడీ సత్యనారాయణను హెచ్‌ఎంతో పాటు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.


ఆదివాసీల అభివృద్ధికి కృషి : పీఓ



చింతమానుగూడలో మినీ మ్యూజియంను ప్రారంభిస్తున్న పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): ఆదివాసీల అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. కురుపాం మండలం నీలకంఠాపురం పంచాయతీ చింతమానుగూడ గ్రామంలో ఆ గ్రామ గిరిజనులు ఏర్పాటు చేసుకున్న గిరిజన కళాక్షేత్రం(మినీ మ్యూజియం)ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మ్యూజియంలో పొందుపర్చిన వేట సాధనాలు, వంట గది ఉపకరణాలు, వన మూలికలు తదితర వాటిని పరిశీలించారు. గిరిజన సంస్కృతిని పరిరక్షించడం, గిరిజన, జానపద కళలను ప్రోత్సహించేందుకు అన్ని రకాలుగా తన వంతు కృషి చేస్తానన్నారు గిరిజన యువత ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అడ్డాకుల మన్మధరావు, ఆదివాసీ నాయకులు ఇంటికుప్పల రామకృష్ణ, చంద్రశేఖర్, నీలకంఠం, కడాయి, రామారావు పాల్గొన్నారు.

నిలకడగా 'తోటపల్లి'లో నీటి ప్రవాహం



తోటపల్లి ప్రాజెక్టులో నీటి ప్రవాహం

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు వద్ద నీటి ప్రవాహం నిలకడగా వుంది. నాగావళి నదిలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద మంగళవారం సాయంత్రం నాటికి 105 మీటర్ల లెవిల్‌కుగాను 104 మీటర్ల లెవిల్‌లో నీరు నిల్వ వుంది. ప్రస్తుతం నది ఎగువ భాగం నుంచి ప్రాజెక్టుకు 1,180 క్యూసెక్కుల నీరు రాగా ఈ మేరకు అధికారులు ఒక గేటును ఎత్తివేసి 1,570 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచి పెడుతున్నారు. కాలువల ద్వారా 1,420 క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 2.5 టీఎంసీలకుగాను 2.137 టీఎంసీల నీటి సామర్థ్యం వున్నట్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు వద్ద నీటిపరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ఇక ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్లు

- కసరత్తు ప్రారంభించిన విద్యుత్ శాఖ
- తొలి విడతగా ప్రభుత్వ కార్యాలయాల్లో..
- త్వరలో అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లకు మీటర్ల అమరిక



పాలకొండ ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ మీటర్

పాలకొండ రూరల్: సాంకేతికత అన్ని రంగాల్లో విస్తరిస్తోంది. తాజాగా విద్యుత్‌శాఖలో మరో అడుగు ముందుకు పడుతుంది. దీంతో విద్యుత్ బకాయిలకు చెల్లు చీటి పడనుంది. మనం వినియోగించే విద్యుత్ అవసరాలకు ముందుగానే రొక్కం చెల్లించేలా నూతన విధానం అమలుకు అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం విద్యుత్ వాడకం అనంతరం ఎన్ని యూనిట్లు ఖర్చు చేశామో లెక్కకట్టి విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నాం. త్వరలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనుండటంతో ముందస్తుగా రీచార్జ్ చేసుకొని ఆ మేరకు వినియోగించుకోవాల్సి ఉంటుంది. అంటే మన సెల్‌ఫోన్‌కు ప్రీపెయిడ్ పద్ధతిలో ఏ విధంగా రీచార్జ్ చేసుకొని వాడుతున్నామో.. అదే విధానంలో విద్యుత్ మీటర్‌కు మనం చేయించే రీచార్జ్ మేరకు సరఫరా కొనసాగనుంది. బ్యాలెన్స్ అయిపోయిన వెంటనే మళ్లీ రీచార్జ్ చేసుకోవాలన్న మాట. లేకుంటే చీకట్లో మగ్గాల్సిందే. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటులో సంబంధిత శాఖ యంత్రాంగం నిమగ్నమైంది.

రానున్న రోజుల్లో..

ప్రస్తుతం ఈ నెల వినియోగించిన కరెంటు బిల్లు మరుసటి నెల చెల్లిస్తున్నాం. బిల్లు పొందిన 15 రోజుల వరకు అపరాధ రుసుం ఉండదు. అపరాధ రుసుంతో మరో 15 రోజుల్లో బిల్లు చెల్లించడానికి సమయం ఉంటుంది. ఈ లెక్కన వినియోగదారుడికి బిల్లు చెల్లించడానికి దాదాపు నెల వరకు సమయం ఉండే ఈ పద్ధతినే అనుసరిస్తున్నాం. తాజాగా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు సంబంధించిన చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. త్వరలోనే అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేలా నిర్ణయించింది. ముందుగా అన్ని ప్రభుత్వ, కమర్షియల్ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు అమరిక ప్రారంభమైంది. 2025 జనవరికి అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమరిక చేయాలనే నిర్ణయంతో అధికార యంత్రాంగం అడుగులు వేస్తుంది. ఈ నూతన విధానం ద్వారా ప్రీపెయిడ్ మీటర్లకు ముందుగానే రీచార్జ్ చేయాల్సి ఉంటుంది. అలా చేయకపోతే సరఫరా ఆటోమేటిక్‌గా కట్ అయిపోతుంది. ఇప్పటి వరకు అమలవుతున్న విధానానికి అలవాటుపడిన వినియోగదారులుకు దీనిపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. నియోజకవర్గంలో దాదాపు 70వేల పైచిలుకు వివిధ రకాల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. కేవలం పాలకొండ పట్టణంలో 11వేల పైచిలుకు మీటర్లు వినియోగంలో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పట్టణంలో స్మార్ట్ మీటర్లను ప్రభుత్వ కార్యాలయాల్లో బిగిస్తున్నారు. ప్రస్తుతానికి ఆ మీటర్లలో ఎటువంటి సిమ్ కార్డు అమర్చలేదు. దశల వారీగా వాటిని ప్రీపెయిడ్ మీటర్లుగా మార్చనున్నారు.

బడుగులపై భారమే..

ఈ నూతన విధానం బడుగులకు భారం కానుంది. విద్యుత్ వినియోగదారుల్లో మధ్యతరగతి వారి కంటే బడుగులే అధికంగా ఉంటారు. వీరు వినియోగించే విద్యుత్‌కు సంబంధించి ముందుగా మొత్తం చెల్లించాలంటే వారికి భారమే. ప్రస్తుత రోజుల్లో క్షణం విద్యుత్ లేకున్నా ఉండటం కష్టం. ఈ తరుణంలో ప్రీ పెయిడ్ మీటర్ల వినియోగంతో కొంతమేర ఇబ్బందులు తప్పవు.

అనేక అంశాలు..

- బ్యాలెన్స్ ఉన్నంత వరకే విద్యుత్ సరఫరా అవుతుంది. నగదు అయిపోయిన వెంటనే విద్యుత్ సరఫరా బంద్ అవుతుంది. రీచార్జ్ చేస్తేనే విద్యుత్ వెలుగులుంటాయి. బ్యాలెన్స్ ఎంతుందో ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి.
- నూతన ప్రీ పెయిడ్ మీటర్లతో అనవసరపు విద్యుత్ వినియోగం తగ్గుతుంది. వినియోగదారుల్లో బాధ్యత పెరగనుంది.
- ఈ నూతన విధానంతో గ్రామీణ ప్రాంత వినియోగదారులు అవస్థలు పడే అవకాశాలున్నాయి.
- మొండి బకాయిల బెడద తప్పుతుంది. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలు ఇకపై అధిక బకాయిలు పెండింగ్‌లో ఉంచే అవకాశం ఉండదు.
- స్మార్ట్, ప్రీపెయిడ్ మీటర్లు అందుబాటులోకి వస్తుండడంతో దీని ప్రభావం విద్యుత్ మీటర్ రీడర్లపై పడనుంది. స్మార్ట్ మీటర్ రాకతో వీరంతా ఉపాధి కోల్పోయే అవకాశం ఉంది.
- విద్యుత్ చౌర్యం పెరిగే అవకాశం ఉంది. లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

“ అందుబాటులోకి 99 మీటర్లు



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు జరుగుతుంది. పాలకొండ పట్టణ పరిధిలో 99 మీటర్లు ఏర్పాటుకు తొలి విడత కసరత్తు చేపట్టాం. ప్రస్తుతం 55 మీటర్ల ఏర్పాటు చేశాం. దశల వారీగా గృహ, వ్యాపార, పారిశ్రామిక సర్వీసులకూ అమలు చేయనున్నాం. వీటి ద్వారా రీడింగ్ యూనిట్లను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. నాణ్యమైన సరఫరాను వినియోగదారులు పొందవచ్చు. ఉన్నతాధికారుల సూచనలతో త్వరలో పూర్తి స్థాయి కార్యాచరణ వెల్లడిస్తాం.

– శ్యాంసుందర్, ఏఈ ట్రాన్స్‌కో, పాలకొండ